

కథా కౌముది

# చదువుకున్న అనాగరికం

కుంతి

**ఇమ్లీబన్ నుండి విజయవాడకు వెళ్ళే బస్సు అపుడే** బయలుదేరింది. బస్ స్టేషన్ నుండి బస్సు బయటికి రావడంతో అంతవరకు వినిపిస్తున్న చిత్ర విచిత్ర రణగొణధ్వనులు, వీస్తున్న దుర్వాసనలు ఆగిపోవడంతో హాయిగా ఊపిరి పీల్చుకున్నాడు విద్యాచరణ్. వాతావరణం ఆహ్లాదకరంగా ఉంది. రెండవ వరుసలో కిటికీకి పక్కనే సీటు దొరికింది. బస్సులో తన పక్కనున్న సీటు తప్ప అన్ని సీట్లు నిండిపోయాయి. బస్సు కూడా బాగానే ఉంది. డ్రైవర్ మంచి అభిరుచికలవాడు కాబోలు పాత హిందీ సినిమా పాటలు పెట్టాడు. అదికూడా చాలా తక్కువ సౌండ్‌లో. ప్రయాణికులు కూడా మర్యాదగా, మౌనంగా, గంభీరంగా ఉన్నారు. అన్ని పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. గమ్యం చేరడానికి కనీసం నాలుగు ఐదుగంటల సమయం పడుతుంది.

ఒక ఉత్తమ పాఠకుడికి, పుస్తకాల పురుగుకు ఇంతకన్నా మంచి పరిస్థితులు ఎక్కడ లభిస్తాయి. ఆకలిగొన్నవాడికి వెండి కంచంలో మృష్టాన్న భోజనం దొరికినంతగా విద్యాచరణ్ ఆనందించాడు. బస్సు ముందుకు నెమ్మదిగా సాగుతుంది. తన బాగ్ నుండి సుమారు 200 పేజీల పుస్తకాన్ని తీశాడు. ప్రముఖ సాహిత్యకారుడి మాస్టర్ పీస్ అది. విజయవాడ వెళ్ళేలోపు దీనిని నమిలి, మింగివేయాలి అనుకుని, ఇంకా కొన్ని పుస్తకాలు ఉన్న బాగ్‌ను ఒక పక్కకు పెట్టుకుని, పుస్తకం చదవడంలో మునిగిపోయాడు.

పుస్తక పఠనాన్ని వ్యసనంగా మార్చుకుని, ఎప్పుడు, ఎక్కడ ఏ మాత్రం ఖాళీ సమయం దొరికినా చదవడంలో ఆనందం పొందుతూ, "భగవంతుడా! నా వార్ధక్యంలో ఏ శక్తి సన్నగిల్లినా చదవగలిగే శక్తిని మాత్రం తగ్గించకు" అని ప్రార్థించుకునే విద్యాచరణ్ బస్సు చక్రాలు రోడ్డుమీద వేగంగా పరుగెడుతుంటే, అంతే వేగంగా తన జంట నయనాలను పుస్తకపు పుటల వెంబడి పరుగుతీయించసాగాడు. మధ్య మధ్యలో బస్సు ఆగినప్పుడల్లా డిస్టర్బై, ఎవరైనా ఎక్కుతారేమో? ఈ ఖాళీ సీటును ఎవరైనా ఆక్రమిస్తారేమో? తన వ్యాసంగానికి ఎక్కడ ఆటంకం కలుగుతుందో అని ఆదుర్దా పడుతూ, ఎవరూ ఎక్కకపోవడంతో హాయిగా ఊపిరి పీల్చుకుంటూ, మళ్ళీ పుస్తక పుటల్లో మునిగిపోసాగాడు.

"రాజుగారు లేకపోవడంతో ఖాళీగా ఉన్న సింహాసనాన్ని ఎవరైనా ఆక్రమించి, రాజ్యాన్ని ఎక్కడ కల్లోల పరుస్తారో అని ఆందోళనపడే రాజ్యప్రజలలా"ఉంది అతడి పరిస్థితి.

బస్సు నగర శివారులోకి చేరుకుంది. బస్సుఆగింది. విద్యాచరణ్ డోర్ వైపు చూసాడు. పూలబుట్టలా, పట్టుబట్టలా, పండ్లతోటలా, తేన ఊటలా అందమైన అమ్మాయి.

అతికష్టం మీద ఒక చేతితో ట్రావెల్ బాగ్‌ను, మరొక చేతిలో సూట్ కేసును మోస్తూ మెడకీ, చెవికీ మధ్య పెట్టుకున్న సెల్‌లో మాట్లాడుతూ ఎలాగో డ్రైవర్ క్యాబిన్ వరకు వచ్చి, సామాను అక్కడ పెట్టి ముందుకు సాగింది. కండక్టరో... డ్రైవరో... మరెవరో చెబుతుండగా వచ్చి, ఖాళీగా ఉన్న సీటులో కూర్చుంది.

బస్సులోకి ఎక్కుతున్నప్పుడుగానీ, లగేజ్ పైకి తెస్తున్నప్పుడుకానీ, కూర్చుంటున్నప్పుడు కానీ, పర్స్‌లో నుండీ డబ్బులు తోసి టిక్కెట్టు తీసుకుంటున్నప్పుడుకానీ ఆమె సెల్‌లో మాట్లాడడం ఆపలేదు. నిష్ణాతుడైన మెకానిక్ పదిమందితో మాట్లాడుతూనే, వెహికల్ భాగాలువిప్పి, మళ్ళీ ఫిక్స్ చేసినట్టుగా ఆ అమ్మాయి సెల్‌లో మాట్లాడుతూనే ఆ పనులు చేసింది. మధ్యలో ఆమె వేసుకున్న చుడీదార్ పైన ఉన్న చున్నీ జారిపోవడం, యౌవనంలో ఉన్న ఆమె సౌందర్యం, రసగంగలా కరిపోవడం, ఇందంతా చూస్తున్న బస్సులో ఉన్న కుర్రకారు గుండెలు స్వర్గపు అంచులు చేరిపోవడం క్షణాల్లో నిర్వహిస్తూనే ఆత్మను పరమాత్మతో అనుసంధానించే భక్తశిఖామణిలా సెల్‌లో మాట్లాడుతూనే ప్రయాణం తాలూకు తొలి అడుగులు కదుపుతుంది.

విద్యాచరణ్, తన సామ్రాజ్యాన్ని అనూహ్యంగా శత్రుదేశాలు ఆక్రమించడంతో అవాక్కయి చేష్టలుడిగిన రాజులా ఉన్నాడు. ఆ సుందరి ఇప్పుడు కాస్తకుదురుగా కూర్చుంది. ఇతడివైపు చూడడంలేదు. అలాగని ఎవరివైపు ఆమె చూడడం లేదు.

భగవంతుడు ప్రత్యక్షమైనప్పుడు భక్తుడు పరవశించి, లోకాలను మరిచి అతడితో సంభాషించినట్లుగా ఆమె 'సెల్'లో మాట్లాడుతూనే ఉంది. ఆమె పైటగాలికి సయ్యాటలాడుతూ ఇతడి మోముపై నాట్యం చేస్తుంది. ఆమె ముంగురులు తీరాన్ని తాకి పోయే అలల్లా గాలికి ఎగురుతూ వచ్చి ఇతడిని తాకి వెళుతున్నాయి. ఆమె ఒంటినుండి వస్తున్న నాణ్యమైన సెంటు పరిమళం నాసికాపుటాలకు హాయిని మోసుకొస్తుంది. ఆమె మాట్లాడుతుంటే పలువరుస ముత్యాల వాకిళ్ళను పరుస్తున్నది. ఆమె నవ్వుతుంటే, చెక్కిళ్ళు వెన్నెల పరవళ్ళు పుక్కిలిస్తున్నవి. ఆమె మోముపై అక్కడక్కడ సన్నని చెమట బిందువులు అరవిరిసిన పుష్పాలపై మంచుబిందువుల్లా ఉన్నవి. ఆమె కంఠం మావిచివురు తిన్న కోయిలలా ఉంది. ఆమె నిండు పరువంతో పోటెత్తడానికి సిద్ధమయ్యే వరద గోదావరిలా ఉంది.

విద్యాచరణ్ సీటుకు అటువైపు సీట్లలో కూర్చున్న యువకులు, వెనుకనున్న నడివయసు మగవాళ్ళు ఇతడివైపు ఈర్ష్యగా చూడసాగారు. నిజానికి ఇంతటి రొమాంటిక్ సిట్యువేషన్ ఒక ఐదు సంవత్సరాల క్రితం అతడికి ఎదురైనా, అంటే వివాహానికి పూర్వం ఎదురైనా అతడు ఎంజాయ్ చేయకపోయేవాడు. అలాగని అందమైన అమ్మాయిలను కన్నెత్తి చూడని ప్రవరాఖ్యుడేమీ కాదు. పుస్తకం చేతిలో ఉంటే, ఎంతటి రంభా ఊర్వశులు దిగివచ్చినా వారివైపు చూడాలని అనిపించదు. అది అతడికి ఎప్పటినుండో ఉన్న తత్త్వం.

తన ఆఫీసులో పనిచేసే కుమారి గుర్తుకు వచ్చింది. ఆమె ఎప్పుడూ సెల్‌లో మాట్లాడుతూ చుట్టూరా ఉన్న లోకాన్ని మరిచిపోయే రకం. ఆఫీసు పనుల్లో శ్రద్ధపెట్టక, అన్ని పనులు తప్పుల తడకగా చేస్తుంది. ఇంట్లో ఇలాగే సెల్‌లో మాట్లాడుతూ, నేల మీద ఉన్న పొయ్యిమీద పాలు మరిగిస్తూండగా, అపుడే అడుగులు వేయడం నేర్చుకుంటున్న ఆమె చిన్నారి పసిపాప మరుగుతున్న పాలు చూసి అటువైపు వెళ్ళి, ఆత్రంగా ఆ గిన్నెను పట్టుకుంది. మరిగిన పాలు ఆ అమ్మాయి మీద పడ్డాయి. పాపకు తీవ్రంగా గాయాలు అయ్యాయి. అతికష్టం మీద ఆ పసిపాప బ్రతికింది. కానీ కుమారికి మాత్రం బుద్ధిరాలేదు.

”అయినా సెల్‌లో గంటలు గంటలు మాట్లాడే విషయాలు ఇంతగా ఏముంటాయబ్బా?” అనుకున్నాడు. తనది ప్రేమ వివాహమే. పెళ్ళికాకముందు తన దగ్గర, రమ్య దగ్గర సెల్ ఫోన్లు ఉండేవి. ఎప్పుడూ పట్టుమని పదినిమిషాలు మాట్లాడుకునేవారు కాదు. ఇక ఇప్పుడైతే ఎంతో అవసరముంటే తప్ప ఫోన్ చేసేది లేదు, మాట్లాడేది లేదు. ఏవైనా ముఖ్యమైన విషయాలు ఉంటే క్లుప్తంగా మాట్లాడుకోవడం పెట్టేయడం అంతే.

"ఆధునిక శాస్త్రీయ, సాంకేతిక ప్రగతి ఇచ్చిన సదుపాయాలను ఉంచుకుని సుఖసౌకర్యాలు అందుకోవాలే తప్ప దానికి బానిసకారాదు" అంటుంది రమ్య. రమ్య బహుశా ఈవిడంత చదువుకున్నది కాదు. కాని సంస్కారి. "పొరుగు వారికి మనవల్ల ఏ అసౌకర్యం కలుగకూడదు" అంటుంది.

టర్నింగ్‌లో బస్సు మలుపు తిరుగడంతో ఒక్కసారిగా పక్కనున్న అమ్మాయి వచ్చి ఇతడి పైవాలింది. పక్కసీటులో నున్న యువకులు అసూయగా చూడసాగారు. ఆమె అలా పడుతున్నప్పుడు గానీ, తగలకూడనివి తగులుతున్నప్పు కానీ, మళ్ళీ తిరిగి లేస్తున్నప్పుడు గానీ ఏ భావం లేకుండా, యుద్ధరంగంలో ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా ధనుర్బాణాలు వీడని యోధుడిలా ఆమె 'సెల్'ను వదలకుండా మాట్లాడుతూనే ఉంది.

విద్యాచరణ్ ఆమె వైపు చూసాడు. ఆమె మాట్లాడుతూనే ఉంది. ఆమె హావభావాలకు, ఆంగిక చేష్టలకు ఆమె శరీరం లయబద్ధంగా కదులుతుంది. అతడికి తగులుతుంది. ఆమె మాట్లాడుతున్న పోష్ ఇంగ్లీష్ విద్యాపరిమళాన్ని వెదజల్లుతుంది. ఎంతో ఆశగా 200 పుటల పుస్తకాన్ని చదువుదామనుకున్నాడు. పదిపేజీలు కాలేదు. నిష్ఠ, తిష్ఠ కుదరడం లేదు. ఏకాగ్రత చెదిరింది.

బ్రహ్మత్వాన్ని కోరి గంభీరంగా తపస్సు చేసుకుంటున్న మహాముని తపస్సును, దేవేంద్రుడు రంభను పంపి తపోభంగం చేయించినట్లుగా ఉంది అతడి పరిస్థితి. కూర్చున్న చోట ఇబ్బందిగా కదిలాడు ఆమె మాట్లాడుతూనే ఉంది. టీవీ యాంకర్‌లా మెలికలు తిరుగుతూనే ఉంది. చెలియలి కట్ట తెంచుకున్న కడలిలా వాక్ప్రవాహం సాగుతూనే ఉంది. తన చుట్టూ మనుషులు ఉన్నారని, తనను అందరూ చూస్తున్నారని, తాను మైమరచి మాట్లాడుతుంటే కొందరు తనను అదోలా చూస్తున్నారని ఆమె భావించడం లేదు. ఆమె నేర్చుకున్న చదువుకూ, బహుశా ఆమె కుంటుంబ సంస్కారానికీ, ఆమె ప్రవర్తనకు పొంతనలేదు.

'సెల్' ప్రపంచంలో మునిగిపోయింది. కాసేపు పుస్తకం మూసి అలాగే కూర్చున్నాడు. "ఈ చదువుకున్న అనాగరికం ఏమిటో?" అనుకున్నాడు.

"గట్టిగా మాట్లాడడం ఆపండి. ఇది పబ్లిక్ ప్లేస్ .. యూస్ యువర్ సెన్స్" అనే ధైర్యం అతడిలో లేదు. పైగా ఆమెను చూస్తే వెంటనే అలా అనాలి అనిపించలేదు. అతడికి ఒక ఆలోచన వచ్చింది.

తన బాగ్‌లో నుండి ఈ మధ్యే ఆవిష్కరించబడిన ఒక మంచిగ్రంధాన్ని తీసి, ఆమె చేతికిస్తూ, "ఇది వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన గ్రంథం. ఒక గొప్ప రచయిత రాసాడు. మీకు ప్రయాణంలో బోరు కొట్టదు" అన్నాడు ఆమె వాక్ప్రవాహాన్ని ఆటంకపరుస్తూ.

ఒకవైపు మాట్లాడుతూనే ఆమె పుస్తకాన్ని చేతిలోకి తీసుకుని, పేజీలు తిరగేసి, మళ్ళీ ఇతడి చేతిలో పెట్టి, తాను మాటల్లో మునిగిపోయింది.

చదువుకున్న వారెవరైనా ఇష్టపడే గ్రంథం అది. డంగైపోయాడు.

ఇంతలో 'ఫోన్' ఆగింది "హమ్మయ్య" అనుకున్నాడు. పుస్తకం తీసి చదవసాగాడు. మరు నిమిషంలో మరొక ఫోన్. మళ్ళీ సీను పునరావృతం. ఈసారి తన బాగ్‌లో నుండి ఈ వయసులో ఉండే వాళ్ళు సాధారణంగా చదివే 'ఛేజ్' నవల తీసాడు. అది ఆమెకు ఇచ్చాడు. ఆమె అతడివైపు చూసి నవ్వుతూ, కాసేపు పేజీలు తిరిగేసి, అతడికి తిరిగి ఇచ్చేసి మళ్ళీ 'సెల్'లోకంలో మునిగిపోయింది. దెబ్బతిన్నట్టుగా అనిపించింది అతడికి. పదినిమిషాలు గడిచాయి. రెండుపేజీలు కూడా చదవలేదు. మానసికంగా, శారీరకంగా కూడా 'డిస్టర్బ్' అవుతున్నాడు.

విద్యాచరణ్ పట్టువదలని విక్రమార్కుడిలా, వ్యాధిని ఎలాగైనా తగ్గించాలని మరొక ప్రిస్క్రిప్షన్ రాసే వైద్యుడిలా తన బ్యాగులో నుండి ఈసారి యువతీ యువకులు సాధారణంగా ఇష్టపడే ఫిల్మ్ మ్యాగ్ జైన్, స్పోర్ట్స్ మ్యాగ్ జైన్, జోక్స్ బుక్స్ తీసాడు. తీసి ఆమె వైపు "తీసుకోండి" అన్నట్లుగా చూసాడు.

ఆమె ఇతడివైపు "మొబైల్ లైబ్రరీలా ఉన్నాడే" అన్నట్లుగా చూస్తూ, మాట్లాడుతూ యధాలాపంగా పుస్తకాలు తిరగేస్తుంటే ఒకటి రెండుసార్లు ఆ పుస్తకాలు కింద తొక్కుడులో పడ్డాయి. మనసు కలుక్కుమంది. అవి మళ్ళీ చేతిలోకి తీసుకుని మాట్లాడసాగింది.

ఇక ఆమెను ఆ సెల్ ప్రపంచం నుండి బయటికి తీసుకురావడం కష్టమని విద్యాచరణ్‌కు అర్ధమైంది.

ఆ శబ్దకాలుష్యాన్ని, ఆ అనాగరిక వాగ్ధోరణిని అడ్డుకోలేనని మనసులో ఓటమిని అంగీకరించుకుంటూ పుస్తకాన్ని మూసి కిటికీ నుండి బయటకి చూడసాగాడు. హైవే మీద బస్సు పరుగెడుతుంది. రోడ్డుపై వెళుతున్న బస్సుల్లో, కారుల్లో, బైకుల్లో ప్రయాణిస్తున్న వారి చేతుల్లోనూ, అడపాదడపా దారిలో వస్తున్న పల్లెటూళ్ళలో కనిపిస్తున్న మనుషుల చేతుల్లోనూ సెల్లులు మ్రోగుతున్నాయి. తనతోటి ఉద్యోగి సూర్యం గుర్తుకు వచ్చాడు. అతడు టాయిలెట్‌లో కూడా 'సెల్' వదలడు. ఈ 'సెల్' రాక ముందు వీరంతా ఎలా బ్రతికారు? ఈ సెల్ ఆవిష్కారంతో ప్రజల జీవితం అత్యద్భుత ప్రగతి శిఖరాలు అందుకుందా? కార్పోరేట్ వ్యాపార ప్రాపంచం అవసరం ఉన్నవాడికి లేనివాడికి 'సెల్'ను దగ్గర చేసింది. ఇది కొంత మంచికే అయినా, దాని ఆవశ్యకతను సక్రమంగా అర్థం చేసుకుని వారు వ్యసనంగా మార్చుకొంటున్నారు. అవసరానికి చేతిలో సెల్ ఉంచుకోవాల్సిన వ్యక్తి, సెల్ చేతిలోకి వెళ్ళిపోయాడు. ఆలోచనల్లో కొట్టుకుపోతున్న విద్యాచరణ్ ఒక్కసారిగా వాతావరణంలో మార్పును గమనించాడు.

ఏదో తెలియని ప్రశాంతత.

ఉరుములు ఉరిమి, మెరుపులు మెరిసి కుండపోతగా వర్షం కురిసి వెలసిన ఫీలింగ్. పక్కకు చూసాడు. ఆమె మాట్లాడటం ఆపింది.

"భగవంతుడున్నాడు!" అనిపించింది.

ఆమె అతడివైపు చూస్తూ, "ఇంతసేపు మీరు వరుసగా ఒక పుస్తకం వెనుక మరొకటి ఇస్తూ పోయారు ఎందుకూ?" అన్నది.

తన లక్ష్యాన్ని భంగపరిచిందన్న కసితో, ఆమె ప్రవర్తన పట్ల కలిగిన చిరాకుతో, "నేను చదువుకోవచ్చునని" కటువుగా అన్నాడు.

ఆమె దెబ్బతిన్నట్టుగా చూసింది. తనను ఇంత షార్ప్‌గా ఎవరూ ఇంత వరకూ కామెంట్ చేయలేదు.

"నా సెల్ నా ఇష్టం. నేను మాట్లాడుకుంటే మీకొచ్చిన నష్టం ఏమిటి? చదువుకోవాలనుకున్న వారికి చదువు మీద శ్రద్ధ ఉండాలి" అని అందామె.

మళ్ళీ సీన్ పునరావృతం.

ఇంతలో సూర్యాపేట వచ్చింది. ఆమె ఒకవైపు సెల్‌లో మాట్లాడుతూనే తన లగేజ్ వైపు వెళుతూ, ఇతడి వైపు చూసింది.

"సారీ! థ్యాంక్స్! " అన్నాడు.

"ఎందుకు? " అన్నది 'సెల్' దూరంగా జరిపి.

"పదిమంది ఉండే చోటు పర్సనల్ స్పీకింగ్‌తో ఇంతసేపు ఇబ్బంది పెట్టిన మీ సంస్కారాన్ని సహించలేకపోయినందుకు.. సారీ! బస్సు దిగిపోతున్నందుకు థాంక్స్!" అన్నాడు.

ఆమె మరొక సారి నిస్తేజురాలై అతడివైపు చూస్తూ, ఏదో అనబోతూ బస్సు కదలడంతో దిగిపోయింది.

బస్సులో ఎవరూ ఎక్కలేదు. సీటు ఖాళీగా ఉంది.

పబ్లిక్ ప్లేస్‌లో, పదిమందిలో ఇలాంటి వారి అనాగరిక ప్రవర్తనకు చింతించకు సెల్ ప్రపంచపు వికృత రూపాన్ని గురించి ఆలోచించక కనీసం మిగిలిన సమయాన్ని అయినా సద్వినియోగం చేయాలనుకున్నాడు. బస్సు మైలు రాళ్ళను దాటుతుంది. పుస్తకంలో పుటలు మారుతున్నాయి. పుస్తకపఠనంలో మునిగిపోయాడు విద్యాచరణ్.

●●●

Click here to share your comments on this story